ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

గురువారం 22 ఫిబ్రవరి 2024

ఖాతాదారులను మోసం చేసిన అక్షర చిట్‌ఫండ్స్ 7లో..

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తా 8లో..

సారలమ్మ వచ్చింది..



సారలమ్మను గద్దెపైకి తీసుకొస్తున్న పూజారులు

జిల్లాలో వనదేవతల జాతర ప్రారంభం

వరాల కుండలతో మహిళల ఊరేగింపు

భారీ సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 21: ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన గల మోరీల వాగు పక్కన శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు బుధ వారం రాత్రి ఘనంగా ప్రారంభం అయ్యాయి. రెండేళ్లకు ఒకసారి జరిగే ఉత్సవాల్లో భాగంగా రాత్రి పూజారి బైరబోయిన వెంకటయ్య ఆధ్వర్యంలో ఉద యం దేవతల గద్దెలు, ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సమ్మక్క- సారలమ్మ జాతర ఉత్సవాల కోసం ఆయన ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు వెంట రాగా డప్పు చప్పుళ్ల మధ్య పూనకాలు వచ్చిన అనేక మంది మహిళలు నెత్తి మీద వరాల కుండలు, ఘటం కుం డ పెట్టుకుని ఒడ్డెర కాలనీ, సుదవేని నర్సాగౌడ్ ఇంటి నుంచి హనుమాన్ వీధి, జాతీయ రహదారి మీదుగా సమ్మక్క-సారలమ్మ గద్దెల వరకు ఊరేగించారు.

దారి పొడవుగా మహిళలు వన మూలికలు, వీర గొల చేత పట్టుకుని నృత్యాలు చేస్తూ రాత్రి వేళలో గద్దెల వరకు చేరుకున్నారు. రాత్రి 10 గంటల వరకు సారలమ్మ గద్దెకు చేరుకుంది. మరు నాడు సమ్మక్క గద్దెకు చేరుకున్న తరువాత భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఒల్లెపు శంకర్ రాజు, ఉపాధ్యక్షులు అలకొండ చంద్రయ్య, సభ్యులు భక్తుల సౌకర్యార్థం టెంట్లు, మంచి నీటి సౌకర్యం కల్పించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను నియమించి జాతరా మైదానంలో శుభ్రం చేయించారు. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ సిబ్బంది బందోబస్తు చేశారు. ధర్మపురి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది స్టూడెంట్ పోలీస్ క్యాడెట్ భక్తులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఉత్సవాల ప్రత్యేక అధికా రి ద్యావళ్ల కిరణ్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు సుదవేని నర్సాగౌడ్, రాజం, కనుకమ్మ, ఎల్లయ్య, సభ్యులు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

గొల్లపల్లి : గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్‌లోని ఎక్కల్‌దేవి గుట్ట వద్ద సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు ఘనంగా పారంభం కాగా, జాతర ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు సారలమ్మ తల్లిని ఎక్కల్‌దేవి గుట్ట అవతల ఉన్న వనం నుంచి అశే ష భక్తజనం వెంటరాగా డప్పు చప్పుళ్ల నడమ అడవి బిడ్డ సారలమ్మ తల్లిని గద్దె వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మొదట జాతర నిర్వాహకులు, ఆలయ పూజారి, భక్తులు, గ్రామస్థులు ఎక్కల్‌దేవి గుట్ట అవతల నుంచి కంకవనంను గద్దెల వద్దకు డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కోయ పూజారి లక్ష్మన్ ఆధ్వర్యంలో సారలమ్మను భక్తిశ్రద్ధలతో గద్దె పై ప్రతిష్ఠించారు. స్థా నిక జంపన్న వాగులో భక్తులు స్నానాలు ముగించుకుని అడవిబిడ్డలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొదటి రోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఇష్టదైవానికి బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోయ పూజారి సారలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. జాతరలో ఏలాంటి అసౌకర్యం కల్గకుండా ఉత్సవ కమీటీ భక్తులకు అన్ని వసతులు కల్పించారు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమీటీ అధ్యక్షుడు గందె భాస్కర్, ఉపాధ్యక్షులు చేని రాములు, తాజామాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.





కంకవనాన్ని తీసుకువస్తున్న భక్తులు. చిల్వాకొడూర్ గుట్టపై నుంచి సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు

అభివృద్ధి పనులకు భూమి పూజ



డబ్బుతిమ్మయ్యపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, ఫిబ్రవరి 21 : మండలంలోని పలు గ్రామాల్లో కోటీ 61లక్షల రూపాయల అభివృద్ధి పనులు సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరిం చారు. మండలంలోని సూరంపేట గ్రామంలో మున్నూరుకాపు సంఘ భవనం, కుల సంఘ భవనం ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మహిపాల్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎంపీటీసీలు రాజేశ్వరీ రాజేందర్, జగన్‌మోహన్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నాగభూషణ్‌రెడ్డి, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ రాజమణి, ఏఈఈ చంద్రశే ఖర్, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, చంద్ర మొహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అయిలన్న, రవి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 21 :సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930కి డయల్ చేయాలన్నారు. గతంలో జిల్లాలో జగిత్యాల టౌన్, మెట్‌పెల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు సైబర్ కేసులు నమోదు కాగా రూ. 2.47 లక్షలు రికవరి చేసి బాధితులకు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం డీఎస్పీ రంగా రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



వినతి పత్రం అందజేస్తున్న లైబ్రరీ ఉద్యోగులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 21 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్ పల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు మల్లేష్‌తో పాటు పలువురు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని లైబ్రరీ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యల పై వినతి పత్రం అందజేశారు.

నృసింహస్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

కొడిమ్యాల, ఫిబ్రవరి 21 : మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం గురువారం నిర్వహించటానికి ముహూర్తం నిర్ణయించగా ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ఈవో వి. అనూష, చైర్మెన్ సత్యనారాయణరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోనే కల్యాణ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. స్వామి వారి కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం స్వామి వారికి హోమం నిర్వహించారు. ఎగువ, దిగువ ఆలయాల్లో వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణానికి హాజరు కానున్నారు.

గోదాంలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మల్యాల, ఫిబ్రవరి 21: మండలంలోని బల్వంతాపూర్ గ్రామ శివారులో గల సివిల్‌సప్లై గోదాంలపై గ్రామస్థులు బుధవారం కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశారు. గోదాంల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని గోదాంల నుంచి లక్క పురుగులు ఇళ్లల్లోకి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాంల నిర్వాహకుల దృష్టికి తీసుకెళితే తమనే బెదిరిస్తున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వ స్థలాల్లో గోదాంలు అక్రమంగా నిర్మించారని, గోదాంలకు వచ్చే వాహనాలతో రహదారులు ధ్వంసం అయి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అందులో ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని సమీప కాశీనగర్ కాలనీ వాసులు కోరారు. గోదాంలను తరలించాలని విన్నవించారు.

మున్సిపల్ కమిషనర్‌గా జగదీశ్వర్ గౌడ్



రాయికల్, ఫిబ్రవరి 21: రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా జగదీశ్వర్ గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కమిషనర్ సంతోష్ కుమార్ నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్ గౌడ్ రాయికల్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గం

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 21 : జగిత్యాల రూరల్ మండల ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బూదారపు జ్ఞానేశ్వర్, సెక్రటరీగా కోలా మహేందర్, క్యాషియర్‌గా మేనేని శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గంగాధర్, శంకరయ్య, శంకర్, రవి, తిరుపతి, కమలాకర్, రాజేష్, రాజు, భూషణం, లక్ష్మీనారాయణ, శంకర్, సంతోష్, ప్రశాంత్, మధు, తిరుమలచారి, కిష్టయ్య, శశి, హుస్సేన్, సత్యం, మల్లేశం, రవి, సత్యనారాయణ, మహేష్, రాంచంద్రం, వెంకటేష్ పాల్గొన్నారు.

సమాచారహక్కు ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా రమేష్

జగిత్యాల, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా పెగడపల్లి మండలం బతికెపల్లికి చెందిన న్యాయవాది రాగం రమేష్‌ను నియమిస్తూ సంఘ అధ్యక్షుడు జవ్వాజి రవీంధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా రమేష్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు అభినందించారు.

విప్ కోలుకోవాలని పూజలు

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 21 : ప్రభుత్వవిప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ త్వరగా కోలుకోని ప్రజా సేవలో నిమగ్నం కావాలని కోరుతూ జగిత్యాల రూరల్ మండలం పొలాస లోని లలితమాత ఆలయంలో ఎన్నం కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుడికి ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయఫౌండర్ చెల్లం స్వరూప, పెద్ది అశ్విని, కళ్యాణి, సత్తయ్య మహేందర్, శ్రీనాథ్, రాజేశం, మహేష్, అమర్, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

గొల్లపల్లి, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలో గల ఆదర్శ కళాశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్, సైబర్ నేరాల ఈవ్ టీజింగ్, గంజాయి నిర్మూలన, డయల్ 1930 పలు అంశాలపై ఎస్సై సీహెచ్ సతీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈ. రాజ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

రాయికల్, ఫిబ్రవరి 21: మండలంలోని కిష్టంపేట, సింగర్రావుపేట గ్రామాల్లో సంకరజాతి పశువులకు ఉచిత థైలేరియా వ్యాధి నివారణ టీకాలను జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్ రావు, సహాయ సంచాలకులు డాక్టర్ భోనగిరి నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి మాట్లాడుతూ థైలేరియా వ్యాధి హీమో ప్రోటోజావాన్ పరాన్న జీవి థైలేరియా అన్యు లేట వల్ల వస్తుందని తెలిపారు. ఈ పరాన్న జీవి హోయ లోమ జాతి గోమర్ల ద్వారా వ్యాపిస్తాయని అన్నారు. ఈ వ్యాధి వచ్చినప్పుడు పశువుకు 105 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుందన్నారు. స్కేపులర్, ఫెమొరల్ లింఫ్ నోడ్స్ వస్తాయ న్నారు. పశు వైద్యాధికారి నరేష్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది ఖాలిక్, పోచయ్య, అంజిత్, పాడి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



వెంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

వెల్గటూర్, ఫిబ్రవరి 21: మండలంలోని స్తంభంపెల్లి కొండపై వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం బుధవారం పురోహితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శోభా యాత్ర నిర్వహించి కొండపైకి ఆలయం లోకి తీసుకవచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పీఠంపై స్వామి వారిని నిలిపి శ్రీ వెంకటేశ్వర స్వామి, పద్మావతి, లక్ష్మీ దేవిల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించి తరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహుడి కల్యాణం

బీర్‌పూర్ : మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారల కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో రాత్రి వేద పండితుల ఆధ్వర్యంలో అంకురార్పణ, మృత్యాంగన విధి పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపం వద్దకు ఉత్సవ మూహూర్తులను తీసుకొచ్చి ఆసీనులగా వించారు. అనంతరం వేద పండితులు కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు చుట్టు పక్కల మండలాలు, గ్రామాల నుంచి భక్త లు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ ఆధ్వర్యంలో బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవర్ తన సిబ్బందితో కలిసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. కల్యాణంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కల్యాణ వేడుకల్లో ఎంపీపీ మసర్తి రమేష్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్ రావ్, కేడీసీసీ డైరెక్టర్ ముప్పాల రాంచంధర్‌రావ్, ఆలయ ఉత్సవకమిటీ మెంబర్ ఎన గంటి సామ్రాట్ గౌడ్, ఈవో సంకుటాల శ్రీనివాస్, అర్చకులు సంతోష్, మధుకుమార్, సందీప్, సంహిత్ పాల్గొన్నారు.

విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పరామర్శ



అడ్లూరిని పరామర్శిస్తున్న బెల్లపల్లి ఎమ్మెల్యే వినోద్

ధర్మపురి, ఫిబ్రవరి 21: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వేర్వేరుగా పరామర్శించారు. నియోజకవర్గ పరిధిలో గల ధర్మపురి, వెలగటూర్, గొల్లపల్లి, పెగడపల్లి మండలాల ఎంపీడీవోలు కూడ లక్ష్మణ్‌కుమార్‌ను పరామర్శించారు.

గొల్లపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడి హైదరాబాద్‌లోని యశోద అసుపత్రిలో చికిత్స పొందుతున్న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్‌ను మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చెవులమద్ది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిలుముల లక్ష్మన్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 21: అటవీ శాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి బుధవారం తెలిపారు. మండలంలోని రంగారావుపేట గ్రామ శివారులోని అటవీశాఖ భూమిలో సంగెపు జగదీష్ ట్రాక్టర్‌తో చదును చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి శివరాజ్ సంఘటన స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్‌ను మెట్‌పల్లికి తరలిస్తుండగా వాహన యజమాని అడ్డుకుని బీట్ అధికారిని భయభ్రాంతులకు గురిచేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ పట్టణ కమిటీ ఏర్పాటు

కోరుట్ల, ఫిబ్రవరి 21 : పట్టణ బీజేపీ కార్యవర్గంను బుధవారం పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా చెట్టుపల్లి సాగర్, ఉపాధ్యక్షులుగా ఎర్ర రాజేందర్, కంఠం ఉదయ్, ఉరుమడ్ల నరేష్, ముల్క ఆంజనేయులు,ఆదిపెల్లి మహేష్, ఓల్ర్పజీ నరేష్, కార్యదర్శులుగా నల్ల రాజేందర్, తోట రాజేశం, గడ్డం రాజశేఖర్, చెట్లపల్లి ఓంప్రకాష్, నారవేని అశోక్, పిట్టల హేమలత, అందుర్తి శ్రీనివాస్, జాప నరేష్, కోశాధికారిగా గుద్దెటి రాజేందర్, యువమోర్చ అధ్యక్షుడు కలాల సాయిచంద్, దళిత మోర్చా అధ్యక్షుడుగా బెక్కం అశోక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడుగా ఎల్లాల నారాయణరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షరాలుగా అయిలాపూరం పద్మరాణి, మైనార్టీ మోర్చ అధ్యక్షులుగా అర్షద్ మసూద్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడుగా గంద్ర వెంకటేష్‌లతో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులుగా నియమిస్తున్నట్లు అధ్యక్షుడు వెంకటేష్ ప్రకటించాడు.

ఘనంగా గంగమ్మ బోనాల జాతర



బోనాలతో వెళ్తున్న మహిళలు

రాయికల్, ఫిబ్రవరి 21: రాయికల్ పట్టణంలో గంగపుత్ర సహకార సంఘం ఆధ్వ ర్యంలో బుధవారం గంగమ్మ బోనాల జాతర ఘనంగా జరిగింది. పట్టణంలోని భీమ న్నవాడ, గుడికోట వాడ, హనుమాన్ వాడ, చెర్లకొండాపూర్, పల్లె సొసైటీలోని వాడలో 500 మంది మహిళలు బోనాలు తీశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని ఊరేగింపు నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మొగిలిపేటలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మల్లాపూర్, ఫిబ్రవరి, 21 : నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అందుకే రాజకీయాల్లోకి వచ్చానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లోని 72 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదం కాకుండా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. గ్రామాల్లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చేలా చేస్తున్నన్నారు. ఎవరికి ఎలాంటి సమస్యలు వచ్చిన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాటిపల్లి సరోజన-ఆదిరెడ్డి, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సతీష్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: మండలంలోని బొప్పాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుక ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాకు చెందిన యువకుడు భూక్య సతీష్(22) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అదే తండాలోని యువకుడు భూక్య సాయికుమార్ తీవ్రగాయాలయ్యాడు. ఎస్ఐ రమాకాంత్ కథనం మేరకు.. వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని భూక్య మంజుల- రాజు దంపతుల ఒక్కాగానొక్క కొడుకు సతీష్ ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తుండేవాడు. బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనం పై స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి ఇంటి నుంచి గొల్లపల్లికి బయలుదేరారు. బొప్పాపూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా ఢీకొట్టింది. దాంతో బైక్ ట్రాక్టర్ భాగంలో చిక్కుకుపోయింది. సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన సాయికుమార్ పరిస్థితి విషమంగా మారింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ఆలకుంట శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.


ట్రాక్టర్ కింద భాగంలో చిక్కుకున్న బైక్

● వారంలో గల్ఫ్ దేశానికి.. అంతలోనే అనంత లోకాలకు..

వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని యువకుడు భూక్య సతీష్ వారం రోజుల్లో గల్ఫ్ దేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న క్రమంలో అతన్ని విధి రోడ్డు ప్రమాదం రూపంలో బలితీసుకుంది. కన్న కొడుకు గల్ఫ్ దేశానికి పయనమవుతున్న తరుణంలో అనంత లోకాలకు వెళ్లడంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తండాలోని మంజుల-రాజు దంపతులు కొడుకు సతీష్. రాజు రెండు నెలల కిందట గల్ఫ్ దేశానికి వలస వెళ్లాడు. కొడుకును గల్ఫ్ తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వారం రోజుల్లో పయనమవుతాడనుకున్న కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృత వార్త తెలుసుకున్న తండ్రి రాజు స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: రెండు రోజుల కిందట అదృశ్యమైన వృద్ధుడు నేహూరి చంద్రారెడ్డి(60) తన ఇంటి సమీపంలోని పాడు పడిన పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం విషాదం నింపింది. ఎస్ఐ రమాకాంత్ కథనం మేరకు.. గ్రామంలోని చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఈ నెల 18న కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఈ నెల 19 ఉదయం నిద్రలేచే సరికి వృద్ధుడు చంద్రారెడ్డి కనిపించకుండాపోయాడు. బంధువులు, చుట్టు పక్కల ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దాంతో తమ మామ కనిపించడం లేదని పేర్కొంటూ కోడలు అనురాధ ఈ నెల 20న ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన చంద్రారెడ్డి తన ఇంటి సమీపంలోని పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటు వైపు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

క్రమశిక్షణ, చట్టాలపై అవగాహన ఉండాలి

- అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ - పీటీసీ, సీటీసీల్లో కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న మహేష్ భగవత్, అభిషేక్ మొహంతి, శిక్షణకు హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం పొందినవారు క్రమశిక్షణ, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ అన్నారు. పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ), సిటీ పోలీసు శిక్షణ కేంద్రం (సీటీసీ)లో బుధవారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణను రాంనగర్‌లోని పీటీసీలో అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ ప్రారంభించగా, ఉజ్వల పార్క్ వద్ద సీటీసీలో పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ అభ్యర్థులు శిక్షణ సమయంలో ఏకాగ్రతతో నేర్చుకున్నట్లయితే ఉద్యోగం సమయంలో సమర్థవంతంగా పనిచేయగలుగుతారన్నారు. పోలీసు ఉద్యోగం అనేది ఒక బాధ్యతాయుతమైనదన్నారు. సమాజంలో రోజురోజుకు నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలు నియంత్రణ కోసం సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలన్నారు. రాంనగర్‌లోని పీటీసీలో హైదరాబాద్, రాచకొండ, సైబారాబాద్, నల్గొండ, గద్వాల నుంచి 675 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణకు హాజరయ్యారు. వీరందరికీ 9 నెలలపాటు ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్, డీఎస్‌పీలు మల్లికార్జున్, విజయపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

● **ప్రజలకు సేవచేసే అవకాశం అధికం: సీపీ**

ఇతర ప్రభుత్వ శాఖలకంటే పోలీసు శాఖ ద్వారా ప్రజలకు సేచేసే అవకాశం అధికమని కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ సీటీసీలో సంగారెడ్డి జిల్లాకు చెందిన 235 మంది కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణను బుధవారం సీపీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 30 సంవత్సరాల పాటు పోలీసుశాఖ తరఫున ప్రజలకు సేవలు అందించే బాధ్యత ఉంటుందన్నారు. పోలీసు ఉద్యోగం చేయాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్ ముఖ్యమని, శిక్షణలో కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మినారాయణ, ఏసీపీ వేణుగోపాల్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గౌతమి



జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి

వేములవాడ, ఫిబ్రవరి 21: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గౌతమి ఆలయ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతర ఏర్పాట్లలో అలసత్వం వహించవద్దని, పనుల్లో వేగం పెంచాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు సమన్వయ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ఏర్పాట్లు తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, ఎడ్ల శివ ఉన్నారు.

రాజన్న సేవలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

వేములవాడ ఫిబ్రవరి 21: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దర్శించుకున్నారు. బుధవారం నాడు ఆయన కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లించుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, ఆలయ సూపరింటెండెంట్ అల్లి శంకర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు ఆయన వెంట ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ముస్తాబాద్, ఫిబ్రవరి 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గంబీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన దమ్మన్నపేట నర్సింహులు (50), దమ్మన్నపేట దేవయ్యలు (55) ముస్తాబాద్ నుంచి లింగన్నపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. నామపూర్ గ్రామంలో ఎదురుగా వచ్చిన ట్రాలీఆటో ఢీకోట్టడంతో నర్సింహులు మృతిచెందగా తీవ్రగాయాలైన దేవయ్య సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వ్యవసాయబావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య



పప్పు నర్సయ్య(ఫైల్)

మానకొండూర్, ఫిబ్రవరి 21: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన పప్పు నర్సయ్య (90) అనే వృద్ధుడు బుధవారం వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డట్టు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. నర్సయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదని తెలిపారు. వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని వ్యవసాయబావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గంగాధర, ఫిబ్రవరి 21: బతుకు దెరువుకోసం వచ్చిన ఓ యువకుడు మేస్త్రీ పని చేస్తుండగా ప్రమాదవశత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని గర్షకుర్తిలో బుధవారం జరిగింది. ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లాకు చెందిన చీమలదిన్నె బాలగురవయ్య(26) కొద్ది రోజులుగా గర్షకుర్తిలో భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం ఇంటి స్లాబ్‌పై సైడు గోడ కడుతున్నాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు బాలగురవయ్య చేయి తాకి కరెంటు షాక్ మృతి చెందాడు.మృతుడి సోదరుడు శ్రీనివాసులు పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఖాతాదారులను మోసం చేసిన అక్షర చిట్‌ఫండ్స్

- చైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న ఒకటో ఠాణా ఎస్ఐ రవికుమార్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: ఖాతాదారులకు సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసగించినందుకు, ఖాతాదారుల డబ్బులతో సొంత ఆస్తులు కూడబెట్టుకునందుకు కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై ఇటీవల ఒకటో ఠాణా, రెండో ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఇద్దరు డైరెక్టర్లు సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్‌ను ఒకటో ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మరో ముగ్గురు డైరెక్టర్లపై కేసు నమోదైంది. ఒకటో ఠాణా పోలీసుల వివరాల ప్రకారం.. చిట్ డబ్బులు సభ్యులకు చెల్లించకుండా మోసం చేసినందుకు ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిట్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 సెక్షన్ 3, 4 ప్రకారం నిందితులపై ఐపీసీ సెక్షన్ 406, 420 రెడ్‌విత్ 34, 5 కింద అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్, ఐదుగురు డైరెక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకటరెడ్డి అక్షర చిట్‌ఫండ్స్‌లో రూ.7 లక్షల చిట్ వేశాడు. చిట్ గడువు ముగిసినప్పగికీ డబ్బులు చెల్లించకుండా చిట్‌ఫండ్స్ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేశారు. బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. హన్మకొండలోని సుబేదారి, వడ్డేపల్లి ఎక్స్‌రోడ్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన పేరాల శ్రీనివాసరావు అనే వ్యక్తి తిరుపతిరెడ్డి అనే వ్యక్తితో కలిసి హన్మకొండలో అక్షర చిట్‌ఫండ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తరువాత తిరుపతిరెడ్డి ఆ సంస్థ నుంచి ఉపసంహరించుకోగా శ్రీనివాసరావు భార్య శ్రీవిద్య, సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్, అలువల వరప్రసాద్, గోనె రమేష్‌లు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. అక్షర చిట్‌ఫండ్స్‌కు కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, బోధన్, ఆదిలాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, ఇతర పట్టణాలలో 54 బ్రాంచిలు ఉన్నాయి. ఏజెంట్ల నుంచి సభ్యులను చేర్పించుకుని చిట్స్ నిర్వహిస్తున్నారు. ఖాతాదారుల నుంచి సేకరించిన డబ్బులతో ఆ సంస్థ పలు చోట్ల భూములు కొనుగోలు చేసింది. గడువు ముగిసిన సభ్యులకు చిట్ డబ్బులు చెల్లించకుండా, ఆ డబ్బులకు అధిక వడ్డీ చెల్లిస్తామని వారిని నమ్మించి ప్రభుత్వ అనుమతి లేని డిపాజిట్ బాండ్ల రూపంలో బాండ్‌లను ఇస్తూ కాలయాపన చేశారు. బాండ్ల కాలపరిమితి ముగిసినా తిరిగి రెన్యూవల్ చేస్తూ వచ్చారు. ఖాతాదారుల డబ్బులతో వెదిర, వెలిచాలలో అక్షర టౌన్‌షిప్, అక్షర టౌన్‌షిప్ ఇండియా పేరిట 50 ఎకరాల భూమి కొనుగోలు చేశారని, గాడిపల్లి, నగునూర్‌లలో కూడా కొంత భూమి కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లోని నాలుగు బ్రాంచీల్లో 800 మంది సభ్యులను చేర్చుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హనుమాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని హనుమాన్‌నగర్ లోని ఓ ఇంటిలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పెంకుటిల్లుకు అంటుకున్న మంటలను అదుపుచేసి పక్కనే గల రెండు గదులకు ప్రమాదం సంబవించకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు గంటపాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది పూర్తిగా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల 50 వేల రూపాయల నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. నిత్యావసర వస్తువులు, బంగారం, వెండి, గ్యాస్ సిలిండర్ సర్టిఫికెట్స్ బట్టలు కొంత నగదు, టీవీ, బట్టలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధం అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మహమ్మద్ సిరాజుద్దీన్, పి చంద్రయ్య, కె శ్రీనివాస్, పి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, సైకిల్ ఢీ: ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 21: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో గల పెద్దంపల్లి గ్రామ కమాన్ సమీపంలో ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీకొన్న సంఘటనలో దొడ్డె పరుశురాములు (59) మృత్యువాత పడ్డాడు. పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె పరుశురాములు గ్రామంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వస్తున్నాడు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న నరసయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ క్రమంలో పరుశురాములు అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సుబ్రమణ్యం(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 13న వేములవాడలో చెట్టు పైనుంచి కిందపడి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో తీసుకువచ్చిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వెళ్లినట్లు తెలిపారు. సుబ్రమణ్యం ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వ్యక్తిగా ఆసుపత్రి రికార్డులో నమోదై ఉందని, మిగతా వివరాలు తెలియరాలేదన్నారు.

కోల ప్రశాంత్‌కు వేములవాడ పోలీసుల పీటీ వారెంట్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: నకిలీ డాక్యుమెంట్లతో భూకబ్జాలకు పాల్పడి కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్‌ను బుధవారం వేములవాడ పోలీసులు పీటీ వారెంట్‌పై జైలు నుంచి తీసుకువెళ్లారు. కోల ప్రశాంత్‌పై వేములవాడలో రెండు ఎస్సీ, ఎస్టీ, రెండు భూకబ్జా కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ కేసుల్లో కోల ప్రశాంత్‌ను నిందితుడిగా కోర్టులో హాజరు పరిచేందుకు పీటీ వారెంట్‌పై తీసుకువెళ్లారు.

● భూకబ్జా, బెదిరింపులకు సంబంధించిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్యను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం బుధవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో భూమయ్యను ఇప్పటికే పోలీసులు రెండుసార్లు కస్టడీకి తీసుకుని ఆయన ఇంటిలో సోదాలు జరిపి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకోగా మంగళవారం మరోసారి కస్టడీకి తీసుకుని విచారించారు. తీగలగుట్టపల్లిలో భూమయ్య పలు భూకబ్జాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులు తయారు చేసి పంచాయతీకార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

రాజకీయ లబ్ధికోసమే సర్పంచ్‌లపై ఎంపీ మొసలి కన్నీరు



బండి సంజయ్ సర్పంచులకు రాసిన లేఖ ప్రతులను చూపుతున్న జడ్పీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21: ఎంపీగా బండి సంజయ్ ఏనాడూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏ ఒక్క గ్రామాన్ని సందర్శించలేదని, సర్పంచులకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదని, ఎన్నికలు సమీపించే సరికి రాజకీయ లబ్ధి కోసం మొసరి కన్నీరు కారుస్తున్నారని కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్లు కనుమల్ల విజయ, డాక్టర్ సుధీర్‌బాబు, ద్వావ వసంత విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపీ సంజయ్ సర్పంచులకు మీ ఆదరాభిమానాలు ఉండాలని లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. సర్పంచులు ఐదేళ్ల అధికారంలో ఉండగా ఏనాడూ స్థానిక సంస్థల గురించి, సర్పంచుల సమస్యలపై, గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరును గానీ పట్టించుకోలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో సర్పంచుల ముందు మొసలికన్నీరు కార్చుతున్నాడని విమర్శించారు. గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని పార్లమెంట్‌లో ఏనాడూ సంజయ్ మాట్లాడలేదని, ఆయనకు ఏ భాషపై కూడా పరిజ్ఞానం లేదన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ఆయన పూర్తిగా అనర్హుడని విమర్శించారు. ఉపాధిహామీ పనిదినాలను 13 కోట్ల నుంచి ఏడు కోట్ల పనిదినాలకు తగ్గిస్తే కనీసం గ్రామాల్లో కూలీలకు పని కల్పించాలని ఏనాడూ కోరలేదని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లోని ప్రతి ఇంటికి నల్లానీటిని అందించే పథకాన్ని నీతిఆయోగ్ ప్రశంసిస్తూ 24 కోట్ల రూపాయలు రాష్ట్రానికి ఇవ్వాలని రెకమండ్ చేస్తే వాటిని కేంద్రం ఇవ్వలేదని, దీనిపై కూడా సంజయ్ నోరుమెదపలేదని అన్నారు. ఇంటింటికి రాముని ఫొటోలను పంపిణీ చేయడం కాదు, ఎంపీగా ప్రజలకు ఏమి చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒక్క జడ్పీ సమావేశానికి కూడా ఎంపీగా సంజయ్ హాజరు కాలేదన్నారు. వ్యవసాయాన్ని ఉపాధిహామీతో అనుసంధానం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ అనేకసార్లు ప్రధానికి లేఖరాస్తే ఎందుకు దానిపై స్పందించలేదని నిలదీశారు. ఇప్పుడు సర్పంచులకు అండగా ఉంటామని చెబుతూ మొసలికన్నీరు కారుస్తున్నారని, ఏ సర్పంచు ఆయనను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తానే తెచ్చానని, రాష్ట్రంలోని అన్ని పథకాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులేనని సంజయ్ చెప్పుకోవడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జడ్పీకి 20శాతం ఇవ్వాల్సి ఉండగా మోదీ సర్కార్ ఐదు శాతానికి తగ్గించిందని, దీనిపై ఏనాడైనా సంజయ్ మాట్లాడాడా అని ప్రశ్నించారు.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



మేడారం.. జన సంద్రం..

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం



సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.

వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.



జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



'క్షయ నిర్మూలనకు కృషి చేయాలి'



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

కొడిమ్యాల, ఫిబ్రవరి 21 : క్షయ వ్యాధి నిర్మూలణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. శ్రీధర్ అన్నారు. బుధవారం టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో మండలంలోని మండలంలోని హిమ్మతురావుపేట గ్రామంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీబీ రహిత గ్రామాలుగా జిల్లాలోని 8 గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో సేకరించిన ప్రతిపాదనలను జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలకు పంపిస్తామన్నారు. ఎంపికైన గ్రామాలకు అవార్డులు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి సమీయొద్దీన్, మాజీ సర్పంచు కృష్ణారావు, మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, డీపీపీఎం హరీష్, నవనీత, సూపర్‌వైజర్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళితుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 21 : దళితుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల మండలం తిప్ప న్నపేటలో రూ. 5లక్షల నిధులతో నిర్మించనున్న ఎస్సీ సంఘ భవనానికి భూమిపూజ చేశారు. గోపాల్‌రావుపేట గ్రామంలో జరుగుతున్న బ్రిడ్జిపనులను పరిశీలించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో రేణుక ఎల్లమ్మదేవి బోనాల పండగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గీతా కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కృషిచేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో కల్లెడ ఎంపీటీసీ షట్కారి పరశురాంగౌడ్, వార్డుమెంబర్ నలువాల రాజం, కాంగ్రెస్‌నాయకులు లైశెట్టి విజయ్,భారతపు గంగన్న, మ్యాదరి రమేష్, ఎంఆర్‌పీఎస్ సంఘనాయకులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 21 : ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత ధ్యేయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలోని నల్ల పోచమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. మొదట పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్ని సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కారుగూరి నర్సయ్య కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, కొంతం రాజం, తిరుమల గంగాధర్, పూదరి నర్సయ్య, కిషన్ రావు, బోడ్డు మల్లేశం, జాగర్ల మహేష్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో ప్రతిభ

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 21 : జిల్లా స్థాయిలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ వ్యాసరచన పోటీల్లో మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరించారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థ వారు పర్యావరణ పరిరక్షణ వ్యాసరచన పోటీలను నిర్వహించగా మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బండి మణిచంద్ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందాడన్నారు. మండల స్థాయిలో కళాశాలలోని విద్యార్థులు షైలారం ప్రతిభ, రిచా, సాయిబాబా, రాజేష్‌లకు బహుమతులు పొందినట్లు తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం వేంకయ్య, రాజేందర్, మనోజ్‌కుమా ర్, గట్టయ్య, మధుబాబు, అంజయ్య, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు గొడవలతో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

●గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎస్సై కౌన్సిలింగ్



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ఉమాసాగర్

వెల్గటూర్, ఫిబ్రవరి 21: విద్యార్థులు అనవసరంగా గొడవలు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై ఉమాసాగర్ సూచించారు. రెండు రోజుల క్రితం కోటిలింగాల ఆర్ అండ్ ఆర్ కాలనీ లోని స్తంభంపల్లి మహాత్మ జ్యోతిబా పూలే బాలుర బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు గొడవ పడి దాడి చేసుకునే వరకు వెళ్లడం మంగళవారం సాయిని జానకిరాం అనే విద్యార్థి గురుకుల పాఠశాల నుంచి పారిపోవడం సంచలనం రేపింది. ఈ క్రమంలో బుధవారం ఎస్సై విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల దృష్టి చదువుపైనే ఉండాలని మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు వస్తే ఉపాధ్యాయులకు, ప్రిన్సిపల్‌కు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. అనవసరంగా గొడవలు పడవద్దని తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ముఖ్యంగా వ్యసనాలకు దూరంగా ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేశం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి కళ్యాణం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 21 : మండంలోని సంగెం గ్రామ శివారులోని రామస్వామి దేవాలయంలో బుధవారం సీతారాముల కళ్యాణం ఘనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేక కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. ప్రత్యేక వేదికపై సీతారాముల కళ్యాణంను జరిపారు. భక్తులు రాము లోకి పల్లకి సేవ నిర్వహించంగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా శంకరయ్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 21 : మండలంలోని శ్రీరాములపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా బండపెల్లి శంకరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు బుధవారం తెలిపారు. ఉపాధ్యక్షునిగా బండపెల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా బండపెల్లి నర్సయ్య, కోశాధికారిగా దోమకొండ ఉదయ్‌కుమార్, ఆర్గనైజింగ్ డైరెక్టర్‌గా బండపెల్లి లక్ష్మీరాజం, గౌరవ అధ్యక్షునిగా బండపెల్లి అంజన్‌కుమార్ లను సీనియర్ నాయకులు లక్ష్మన్ సమక్షంలో ఎన్నుకున్నారు.

జన జాతరకు ఏర్పాట్లు పూర్తి



వెల్గటూర్ సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద పరిశీలిస్తున్న ఎస్సై ఉమాసాగర్

వెల్గటూర్, ఫిబ్రవరి 21: రాజక్కపల్లి, స్తంభంపెల్లి గ్రామాలలో నిర్వహించే సమ్మక్క, సారలమ్మ జన జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మ వార్ల కొలువుదీరే గద్దెలను సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం అమ్మవార్ల గద్దెల వద్ద కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్సై ఉమాసాగర్ అమ్మవార్ల జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. గురువారం కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమ్మక్క గద్దెల మీద కొలువుదీరనున్నారు. వెల్గటూర్ మాజీ సర్పంచ్ మురళి, రాములు, ఏఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తా

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు



బండలింగాపూర్‌లోని అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న కృష్ణారావు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 21 : నియోజక వర్గం అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి అనంతరం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించిన కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు లకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సంబంధిత శాఖ మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న దృషి తీసుకొస్తే పరిష్కారించి, అభివృద్ధి నిరంతం జరిగేలా మీతోనే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైసీఎంపీపీ పోతుగంటి రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గొల్లపల్లి, ఫిబ్రవరి 21 : గొల్లపల్లి మండలం శంకర్రావుపేట గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సోకి గోలి చుక్కన్న అనే పాడిరైతుకు చెందిన గేదే ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బుధవారం అక్కడికక్కడే మృతి చెందింది. మేతకు తీసుకువెళ్లే క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన గేదేకు ప్రమాదవశాత్తు షాక్ కొట్టడంతో మృతి చెందింది. సుమారు రూ. 95 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత పాడిరైతు కన్నీళ్లపర్యంతమయ్యారు.

రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 21 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్సెమెంట్, స్కా లర్‌షిప్స్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి అరవింద్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలోని జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్ర మంలో ఏబీవీపీ సంయుక్త కార్యదర్శి అభివెంకట్ పాల్గొన్నారు.

'బీసీల గురించి మాట్లాడే అర్హత కవితకు లేదు'

కథలాపూర్, ఫిబ్రవరి 21 : బీసీల గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్సీ కవితకు లేదని రాష్ట్ర మున్నూరు కాపు రైతు విభాగం అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన 10 సంవత్సరాలు బీఆర్ఎస్ సర్కారు బీసీల గురించి పట్టించుకోలేదని పైగా బీసీ కుల గణనపై రాద్ధాంతం చేయడం విడ్డూరమన్నారు. శాసన సభలో చర్చ జరిగిన అనంతరమే ఏకగ్రీవంగా సభ ఆమోదించిందన్నారు. బీసీల కోసం కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో ఆశించిన మేర నిధులు కేటాయించారన్నారు. తన బానిసలతో అవాకులు, చెవాకులు పేల్చడం సిగ్గు చేటని చెప్పారు.

కాలిన కొట్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

కథలాపూర్, ఫిబ్రవరి 21 : మండలంలోని తాండ్ర్యా లలో రెండు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టగా కాలిపోయిన పశువుల కొట్టంను బుధవారం వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. బాధిత రైతు బద్దం గంగారెడ్డిని పరామర్శించి జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా అంబారిపేట, భూషణరావుపేట గ్రామాల్లో జరిగిన పలు శుభకార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, లింగంగౌడ్, సత్యనారాయణ, న్యావనంది శేఖర్ ఉన్నారు.

కోరుట్ల ఎంవీఐగా శ్రీనివాస్

కోరుట్ల, ఫిబ్రవరి 21 : కోరుట్ల ఎంవీఐగా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. కోరుట్లలో పని చేస్తున్న ఎంవీఐ రంజిత్ మంచిర్యాల జిల్లా కేంద్రానికి బదిలీ కాగా అతని స్థానంలో కొత్తగూడం నుంచి శ్రీనివాస్ కోరుట్లకు బదిలీపై వచ్చారు. బాధ్యతలను స్వీకరించిన శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతూ బదిలీపై వెళ్లిన రంజిత్‌ను పట్టణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు వీడుకోలు పలికారు.

తహసీల్దార్, ఎస్సైలకు సన్మానం

గొల్లపల్లి, ఫిబ్రవరి 21 ! గొల్లపల్లి తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ జమీర్‌ను, ఎస్సైగా విధుల్లో చేరిన చిర్ర సతీష్ కుమార్‌ను బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. అధికారులకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.